
# ఒక రైలు కథ



టి. రామమోహన్

రేపు పదకొండు గంటలకు ఇంటర్వ్యూ. ఈరోజే ఎమ్.ఏ. పరీక్షలు ముగిసాయి. రేపటికల్లా హైదరాబాదు చేరుకోవాలి.

ఇంటికి రాగానే గబగబా బట్టలు సర్దుకున్నాను. మూడు గంటలకు హైదరాబాదు వెళ్లే వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ అందుకోవాలి. భోజనం చేయాలనిపించలేదు. టిక్కెట్టు రిజర్వు చేయలేదు. వెంటనే స్టేషను చేరుకున్నాను....పరీక్షల ధ్యాసలోపడి రిజర్వేషన్ చేయించాలన్న విషయాన్ని గూడా మర్చిపోయాను.

కౌంటరు దగ్గరికెళ్లి బెర్తు దొరుకుతుందో, సీటు దొరుకుతుందో ననుకుంటూ క్యూలో నిల్చున్నాను. ఊహూ....! బెర్తూ లేదు, సీటూ లేదు! సరే జనరల్ కంపార్టుమెంటులో వెళ్లాలి. అందులో కనీసం నిలుచోడానికైనా స్థలం దొరికితే సంతోషం! అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ లాంటిదేదైనా వుండి ఏఏ దేశం గత సంవత్సరాల్లో అభివృద్ధి సాధించిందని విచారిస్తే భారతదేశం ఒక్క విషయంలో మటుకు ప్రపంచంలోనే

ప్రథమ స్థానాన్ని అలంకరిస్తుంది! ఎందులో?.... జనాభివృద్ధిలో!

ప్లాట్‌ఫారంపై అటూ ఇటూ తిరుగుతున్నాను. ఇంతలో ట్రైను వచ్చి ఆగింది. జనాలు తోసుకుంటూ ఎక్కడం ప్రారంభించారు. జనరల్ కంపార్టుమెంటు వెదుక్కుంటూ వెళ్తున్నాను. ఇంతలో "ఒరేయ్, సుధాకర్....ఆగరా.... ఆగు" అంటూ ఎవరో వెనకనించి పిలవడం విన్పించింది.

ఆగాలనిపించలేదు. ఆలస్యం చేస్తే అక్కడ దొరికే సీటైనా దొరకదు. ఎవడో తెలిసిన పనిలేని ప్లాట్‌ఫారం పక్షి పిలుస్తూంటాడు. ఏముంది! చదువైన తర్వాత ఉద్యోగం ఎలాగూ రాదు. ఇంట్లో కూర్చుని ఈగలు తోలుకోలేరు. అదైనా ఎంత సేపని చేయగలరు. మధ్యాహ్నానికి రోడ్ల సర్వే పూర్తవుతుంది. సాయంత్రం పూట పొద్దు పోపడానికి అలా ప్లాట్‌ఫారంపైన పచార్లు, ఇక్కడ మామూలే. నేను మరింత వేగంగా ముందుకు వెళ్ళాను.

వెనక పిల్చినవాడు భుజంపట్టి మరీ ఆపాడు.తప్పదనుకొని వెనక్కి తిరిగాను.

రమేష్....! ఎగాదిగా చూశాను. చూడగానే తెలుస్తోంది.... వీడు టికెట్ కలెక్టర్‌ని.... ఒకసారి కలిసినప్పుడు చెప్పినట్టు గుర్తు. గ్రాడ్యుయేషన్ అయిన తర్వాత రైల్వే సర్వీస్ కమీషన్ ప్యాను అయ్యాననీ, ఇంటర్వ్యూ పాస్ చేయించడానికి మంచి రికమెండేషన్ కూడా వుందనీ.... మరి ఇన్ని అర్హతలున్న వీడికి కాక మరెవరికి వస్తుంది ఉద్యోగం! మనిషి బాగా దర్జాగా వున్నాడు. ఎవరో అన్నట్టు గుర్తు.... రైల్వే ఉద్యోగి, రాజుగారి బొమ్మర్ది.... ఇద్దరూ ఒకే కోవకు చెందుతారట.

"ఏరా పిలుస్తూంటే అలానే వచ్చేశావు! వినబడలేదా ఏం?" అన్నాడు కొంచం కోపంగా.

"లేదురా. అర్జంటుగా హైదరాబాదు వెళ్తున్నాను. రిజర్వేషనులేదు. అందుకని జనరల్ కంపార్టుమెంటు వెదుక్కుంటున్నాను" అన్నాను.

"రిజర్వేషను లేదా? అబ్బ మరీ రష్‌గా వుందే! సరే బెర్తు కావాలా?" అన్నాడు.

ఏప్పినట్లుంది వీడి ప్రశ్న. నాలుగు రోజుల్నుండి అన్నంలేనివాడి దగ్గరికెళ్ళి నీకు భోజనం కావాలా?.... అని అడిగినట్లుంది. అయినా వీడు తప్పకుండా నాకో బెర్తు ఇప్పించగలడనే నమ్మకం కలిగింది.

"సరే,రా." అంటూ తీసుకుపోయాడు. పైపు చేసిన పేపర్లు అటూ, ఇటూ తిప్పి "పాకాల వరకూ ఎః కంపార్టుమెంటులో రా. అక్కడ నీకో బెర్తు ఇప్పిస్తా," అన్నాడు.

సరే. తప్పదు. నీటముంచినా పాల ముంచినా నీదే భారం అనుకొని సూటు

కేసు ఒక మూల వుంచి కంపార్టుమెంటు తలుపు దగ్గర నిల్చున్నాను.

ట్రైను బయలుదేరింది. అందరూ వాళ్ళ వాళ్ళ సీట్లలో సెటిల్ అయి పోతున్నారు. నేను మహా గిల్టీగా ఫీలవుతున్నాను. ఏదో టికెట్టు దొంగగా ప్రయాణం చేస్తున్నానేమో అన్నట్లు అక్కడున్నవాళ్ళు చూస్తున్నట్టు అనిపించింది. మన ప్రజల్లో కొన్ని ప్రత్యేకతలున్నాయి. దొంగైనా సరే కాలు మీద కాలేసుకొని తీవిగా కూర్చుని రాజకీయాలో, సినిమాలనో గురించి అనర్గళంగా ఉపన్యాసం ఇస్తూంటే నోళ్లు వెళ్ళబెట్టుకొని మరీ వింటారు. మధ్య మధ్యలో దొంగలను గురించి, వాడు చూసిన వింత దొంగతనాల్ని గురించీ వివరిస్తాడు. అందరి సందేహాల్నీ తీరుస్తాడు.... వీలుదొరికితే రెండు సూటు కేసుల్ని పట్టుకొని చక్కాపోతాడు.... అందరూ కూర్చుని ఒకడు నిలబడితే వింతగా చూస్తారు, అందరూ నిలబడి ఒకడు కూర్చుని వుంటే మరింత వింతగా చూస్తారు. ఇది మనుషుల్లో వుండే ఒక రకమైన బలహీనత.

పాకాల ఎప్పుడొస్తుందా అని ప్రార్థిస్తూ నిల్చున్నాను. రైలు పాకాల జంక్షన్‌లో ఆగింది. గబగబా సూటు కేసుతో సహా దిగి కంపార్టుమెంటు ముందర నిల్చున్నాను రమేష్ కోసం వెయిట్ చేస్తూ.

రమేష్ వచ్చాడు. రాగానే "వెళ్ళి నలభై రెండవ సీట్లో కూర్చో" అన్నాడు.

"వెళ్ళి కాఫీతాగి వద్దాం రా" అన్నాను.

బయల్దేరాం. రమేష్ వెంట ఒక అమ్మాయి కూడా రావటం అప్పుడే గమనించాను. చేతిలో సూట్‌కేసు వుంది. ఈమె కూడా సీటుకోసం వచ్చుంటుందని అనుకున్నాను.

"ఏరా, ఇంత అర్జంటుగా హైద్రాబాదు వెళుతున్నావు?" అన్నాడు రమేష్.

వాడితో అబద్ధం చెప్పాలనిపించ లేదు. "ఇంటర్వ్యూ ఉందిరా. ఈరోజే పరీక్షలు ముగిసాయి. అందుకనే ఈ హడావుడి" అన్నాను.

"బై దిబై చెప్పడం మర్చాను. ఈమె గీత, మా కజిన్ సిస్టరు. హైదరాబాదు దాకా వస్తుంది." అన్నాడు రమేష్.

"గ్లాడ్ టు మీట్ యూ" అన్నాను.

ఆమె సమాధానంగా ఏదో అంది. కాని వినబడలేదు.

కాఫీ ముగించి నలభై రెండవ సీటు దగ్గర చేరుకున్నాను. వెనకనే ఆ అమ్మాయి, రమేష్ వచ్చారు. ఆమె నలభై అయిదవ సీటులో కూర్చుంది.

రైలు కదిలింది.... నేను అప్పుడే కొన్న మాగజైను తిప్పుతూ కూర్చున్నాను. చదవాలనిపించలేదు.

"ఏమండీ. ఆ మాగజైను కొంచెం ఇస్తారా?" అంది.

"కొంచెం అంటే సగం ఇవ్వ మన్నారా?" అన్నాను నవ్వుతూ.

"జోకులు కూడా బాగావేస్తారే!" అంది నవ్వుతూ.

"ఇందాక ఏదైనా బాగా 'వేయడం' చూశారా? జోకులు కూడా అంటున్నారు" అన్నాను కొంచెం వ్యంగంగా.

"చూశాగా ఇందాకా!" అంది.

ఆశ్చర్యమేసింది. ఏం చూసిందబ్బా అనుకుంటూ "చెప్పండి నాకేమీ తోచడం లేదు" అన్నాను.

"ట్రైను ఎక్కగానే మీ సూటుకేసును విసురుగా క్రింద 'వేయడం' చూశాగా" అంది.

గడుసు అమ్మాయే. 'గీత' పేరు బాగుంది. పేరేకాదు మనిషీ అందంగా వుంది. ఈమెను పెళ్ళాడాలని ఎవడి నుదుటి 'గీత'లో రాసుందో.

"మీరు ఇంటర్వ్యూకి వెళ్లుతున్నారా?" అంది మళ్ళీ మాట మారుస్తూ.

"అవునండీ." అన్నాను.

"ఎక్కడ" అంది.

"ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా."

"ఓహో అలాగా. మీరు గ్రాడ్యుయేటా?" అని ప్రశ్నించింది.

ఈ అమ్మాయి నన్ను ఇక్కడే ఇంటర్వ్యూ చేసేటట్టుంది. మళ్లీ మళ్లీ ప్రశ్నలు ఈమెకు మిగల్చకూడదను కొని_

"పోస్టు గ్రాడ్యుయేషన్‌ను ఈ సంవత్సరమే ముగిస్తున్నాను. ఇంటర్‌లో ఫస్ట్‌క్లాస్, బి. ఏ. లో ఫస్ట్‌క్లాస్, అపైన ఎమ్. ఏ. ఎకనామిక్స్ ప్రీవియస్ ఫస్ట్ క్లాస్. ఫైనల్‌లో ఫస్టుక్లాసు తప్పకుండా వస్తుంది. ఇవికాక పైపు హయ్యర్, షార్టుహాండు లోయర్ పాసయ్యాను," అన్నాను గబగబా ఆపకుండా.

"అలాగా!" అంది కళ్లు ఇంత పెద్దవి చేస్తూ.

కళ్లు చాలా అందంగా వున్నాయి. ఇలాంటి కళ్ళలోకి కళ్లుపెట్టి చూడాలని పిస్తుంది. అలా చూసినవారే కాబోలు కడకు కాంతాదాసులైపోయారు. మంచి కంపెనీ ఇప్పించినందుకు మనసులోనే రమేష్‌కు ధన్యవాదా లర్పించుకున్నాను.

ట్రైను ధర్మవరంలో ఆగింది.

"ఏమైనా తింటారా?" అన్నాను_

"గడ్డితప్ప మిగతా అన్నీ తింటా నండీ. కానీ ఈ రైల్వే రెస్టారెంట్స్‌లో గడ్డి తప్ప మరేదీ దొరకదు. మీకంత శ్రమెందుకులెండి. నా దగ్గర పళ్ళు, బిస్కట్లు వున్నాయి. చాలు" అంది నవ్వుతూనే.

నేను బయటకు వెళ్లాను. రైలు బయలుదేరుతుందనగా వచ్చి కూర్చు న్నాను. ప్రక్క సీట్లవాళ్లు వాళ్ళ బెర్తుల్ని దించుకోవాలని ముందు స్టేషన్లో నుంచీ ఒకే విసుక్కుంటున్నారు. ఇహతప్పదు. త్రీటయర్ కంపార్టుమెంటు నల్లభై

రెండు, నలభై ఐదు క్రింద వరుస బెర్తులే. అందుకని పడుకొని మాట్లాడు కున్నా ఇబ్బందిలేదు.

కుడివైపుకు తిరిగి పడుకున్నాను; గీతతో అలాగే రాత్రంతా మాట్లాడాలని పించింది.

"మీకు ఏదంటే ఇష్టమండి, ఐ మీన్ రాజకీయాలా ? సినిమాలా ? ఆర్టా ? సంగీతమా?" అన్నాను, నాకేదో మహా ఇష్టమున్నట్లు.

"నాకు ఆర్టులో మోడరన్ ఆర్టు అంటే భలే ఇష్టం. ఎందుకో తెలుసా? మనం వేసిన బొమ్మ ఎవరికీ అందంగా కనిపించకపోయినా, అందులో తలాతోకా లేకపోయినా, నో ప్రాబ్లం.కళ్ళు మూసు కొని బాగుందంటారు. బాగాలేదని చెప్పే దమ్ములు ఎవరి కుంటాయ్? అలా చెప్పా రంటే వాళ్లే ఫూల్స్ అయిపోతారు." అంది గలగలా నవ్వుతూ.

"మరి మీకు?" అంది.

"నాకు.... నాకు.... ఇంటర్నేషనల్ పొలిటిక్స్ అంటే ఇష్టం" అన్నాను. కొంపదీసి ఏదైనా డౌట్ అగడగదు గదా అనుకొని....

అలా మాట్లాడుతూనే నిద్రపట్టేసింది. తెల్లవారి లేచి చూస్తే సికింద్రాబాదులో వుంది ట్రైను. అప్పటికే ఆమె తన సామాన్లు సర్దుకొని కూర్చొనుంది.

"చాలా థ్యాంక్సండీ!" అంది.

ఎందుకో మరి. బహుశా మంచి కంపెనీ ఇచ్చాననుకుంది కాబోలు.

అదేమాట అంది. "మీరుచాలా మంచి వారండి. ఈ కాలంలో అబ్బాయిలు అమ్మాయిని ఒక ఫర్లాంగు దూరంలో చూడగానే వంకర్లు తిరిగిపోతారు. మీరు ఇసుమంత అసభ్యంగా ప్రవర్తించ కుండా మంచి సంస్కారవంతులనిపించు కున్నారు. ఐ లైక్ యు వెరీమచ్...." అంది.

గాలి కొట్టిన్న బెలూన్‌లా అయిపో యాను. సరే ఆ అమ్మాయి ఇన్ని మాటలు చెప్తే నేనూ ఒక్కమాటన్నా చెప్పకుండా పోతే బాగుండదని "నే నిలా సభ్యతగా, సంస్కారంగా ప్రవర్తించడానికి కారణం మీలో నాకంటే ఎక్కువ సభ్యత, సంస్కారం వుండటమే" అన్నాను.

"చూశారా! ఆడది తన హద్దులు దాటనంతవరకు మగవాడికి పైన కనీసం చెయ్యివేసే ధైర్యం వుండదండి. కనీసం ఒక వేలు తగిలే అవకాశం ఇచ్చినా ధైర్యంగా కాలుకూడా వేయగలడు" అంది పురుషులపైన రీసెర్చి చేసినట్లు.

"మీరు చాలా ఫ్రీగా మాట్లాడుతా రండి." అన్నాను ఏదో మెచ్చుకుంటు న్నట్లుగా.

"ఫ్రీగా కాక దానికీ డబ్బిచ్చుకోమం టారా?" మీ మగవాళ్లలో మనీమైండెడ్ నెస్ ఎక్కువయిపోతూందండి. ఇప్పుడు

ఆడది తనకు కావాల్సిన, ఆప్తులైన వారందర్నీ వదులుకొని వస్తున్నా, లక్ష్మీదేవిలాంటి స్నేహితురాల్ని మాత్రం తనతో నే తీసుకురమ్మంటున్నారు కాబోయే భర్తలు. ఇంకొన్ని రోజులకు ఫ్రీగా మాట్లాడటం పోయి మాటకింత అని వసూలుచేసినా చేస్తారు," అంది ఆవేశంగా.

అమ్మ బాబోయ్.... ఈ అమ్మాయి ఏ స్త్రీ అభ్యుదయ సంఘ సభ్యురాలో అయ్యుంటుంది! అయినా పాపం ఈ రోజుల్లో కట్నాలు అమ్మాయిల పాలిట ఒక శాపం మాదిరి తయారయ్యాయి. అందుకని తను కట్నం తీసుకోకుండా పెళ్లిచేసుకోవా లనుకుంటున్నాడు. ఈ అమ్మాయి ఇంత ఘాటుగా మాట్లాడ టంలో ఒక అందం వుంది.

ఫ్రాంక్‌గా మాట్లాడేవాళ్ళు అంటే నాకు మొదట్నుంచీ అభిమానం....

హైదరాబాదు వచ్చేసింది.

"వెళ్ళొస్తానండి. అనుకోకుండా కలుసు కొన్నాము. కలుసుకోక ముందు మీకు నేను, నాకు మీరు తెలియదు. తెలుసు కున్న తర్వాత అనుకోకుండా కలుసు కుంటే మన అదృష్టం. ఉంటాను మరి, బై.... సీయూ...." అంటూ గబగబా వెళ్ళిపోయింది.

గీత నిజంగా గలగలా పారే సెల యేరు లాంటిది. తీగ మీటితే కమ్మని రాగం. గీతాగానం చేసుకుంటూ స్టేషన్ బయటకు వచ్చాను.

* * *

హైద్రాబాదులో మిత్రుని రూము వెదుక్కుంటూ బయలుదేరాను. వస్తానని ముందుగా ఉత్తరమన్నా వ్రాయలేదు. నేను రూముకు వెళ్ళేసరికి సరిగ్గా బయల్దేర బోతూ వున్నాడు. అదృష్టం బాగుంది. వాడు వెళ్ళిపోయి వుంటే వాణ్ణి వెదు క్కుంటూ మళ్ళీ.... ఉన్న టైము తక్కువే,మూడు ముక్కల్లో విషయాన్ని చెప్పేసి, నేను వెంటనే తయారై వస్తానని గబగబా బాత్‌రూమ్ వైపు వెళ్ళాను.... ఐదు నిమిషాల్లో తయారై బట్టలు వేసుకొని ఫైలుకోసం బ్యాగులో చెయ్యిపెట్టాను.... అంతే.... షాక్ తిన్నాను.... ఫైలు కనపడలేదు. గబగబా బట్టలు బయటికి లాగి సూటుకేసును త్రిప్పించి, మర్లించి, బోర్లించి వెదికాను.

ఫైలు కనబడలేదు. అందులోనే ఇంటర్వ్యూకి కావాల్సిన కాగితాలన్నీ వున్నాయి. పిచ్చివాడ్నయిపోయాను. అందులోనే డబ్బూ వుంది.

నా వాలకం చూసిన మిత్రుడు శాస్త్రికి అర్థంకాక "ఏమయ్యిందిరా? అలా అయి పోయావు!" అన్నాడు.

"అంతా అయిపోయిందిరా.ఇంటర్వ్యూకె కెళ్ళాలి గదా? అందుకు సంబంధించిన పేపర్సు అన్నీ ఒక ఫైలులోపుంచి తీసు



కొచ్చాను. అది కనబడ్డంలేదే ?!" అన్నాను దిగులుగా.

"ఇంట్లో మర్చిపోయావేమో ?" అన్నాడు వాడు సందేహంగా.

"నోనో ! నా ప్రాణాలన్నీ అందులోనే వుంచి తీసుకువచ్చాను."

వాడు నన్ను సమాధానపరిచాడు. పోతే పోయింది ఇంకో ఇంటర్వ్యూకు అటెండు కావచ్చు లెమ్మన్నాడు. అసలు జరిగిందేమో చెప్పమన్నాడు.

నేను మొదటి నుంచీ చివరిదాకా జరిగిందంతా చెప్పాను.

"అయితే ఆ అమ్మాయికి తప్ప ఎవరికీ అవకాశం లేదు. అందులోనూ దొంగలైతే మొత్తం సూట్‌కేసు తీసుకొనిపోక ఫైలు మాత్రం ఏం చేసుకుంటారు? ఆ అమ్మాయి రమేష్ కజిన్ సిస్టరు కదూ వాడు కనబడినప్పుడు విచారిద్దాంలే" అన్నాడు శాస్త్రి

రమేష్ వాడికీ బాగా తెలిసిన మిత్రుడే.

రెండు రోజులు హైదరాబాదులోనే గడిపి తిరిగి ఇంటికి వచ్చేశాను కొంత డబ్బు వాడి దగ్గర అప్పుగా తీసుకొని.

*　*　*

ఆ అమ్మాయి గీత నా ఫైలు కాజేసింది. ఇందులో సందేహం లేదు. ఛీ....! ఛీ....! ఎంత బాగా మాట్లాడింది. పైగా సభ్యత, సంస్కారంపై చర్చలు. బహుశా ఆమెకు నేను ఇంటర్వ్యూకి వెళ్ళడం ఇష్టంలేదు లాగుంది. రమేష్‌ను అడిగి అడ్రసు తీసుకొని వెళ్ళి బాగా దులిపేయాలి అని నిశ్చయించుకున్నాను.

స్టేషను వెళ్ళాను. రమేష్ ఇప్పుడు వేరే రూట్‌లో వెళుతున్నాడట-ఇంకొన్ని రోజుల తర్వాత ఇటువైపు వస్తాడట. కొన్ని రోజులు ఆగుదామని నిర్ణయించుకొన్నాను.

ఒకరోజు రమేష్‌ను కలుసుకోగలిగాను.

"ఒరేయ్! నీవు నాకు ఇంత మోసం చేస్తావనుకోలేదురా?" అన్నాను.

"ఏమిట్రా ఏమయింది! ఎందుకలా వున్నావు?" అన్నాడు రమేష్.

"నాకు అర్జంటుగా ఆ అమ్మాయి అడ్రసు ఇవ్వు" అన్నాను.

"ఏ అమ్మాయి?" అన్నాడు ఏమీ తెలీనట్టు.

"అదే, ఆ రోజు ట్రైనులో నాతో కలిసివచ్చిందే ఆ అమ్మాయి. మీ కజిన్ సిస్టరన్నావుగా!"

"ఇంతకూ ఏమయిందిరా? అడ్రసు ఎందుకు?" అన్నాడు అతిమామూలుగానే.

జరిగిందంతా చెప్పాను. "ఒరేయ్ అందులో ఖర్చులకని తీసుకపోయిన డబ్బు కూడా వుంచాను. మన శాస్త్రిగాడు అక్కడ లేకుంటే హైదరాబాదులో బిచ్చం ఎత్తుకోవలసి వచ్చేది. ఏ ప్రెస్ ఫోటోగ్రాఫరు కంట్లోనైనా పడివుంటే అందమైన ఫోటో ఒకటి తీసి 'జంట నగరాల్లో బిచ్చగాడు' అనే శీర్షిక క్రింద ముద్రించేసి వుండేవాడు." అన్నాను కోపంగా.

"ఒరేయ్, నీకు బుద్ధి తక్కువైపోతోందిరా. గీత అలా చేసుండదు. నీకు అనుమానం ఎందుకు, నేను వెళ్లినప్పుడు కనుక్కుంటానులే.... అంతగా నీకు అడ్రసే కావాలంటే రాసుకో" అన్నాడు కొంచెం కోపంగా.

అడ్రసు రాసుకొన్నాను.... గీత.... కొంచెం అయ్యుంటేనా 'గీత'నే మార్చేసి వుండేది. ఎంత తియ్యగా మాట్లాడింది. అయినా ఈ రోజుల్లో మోసాలు 'మసాలాల' మాదిరి తయారై పోతున్నాయి. ఇహ బుద్ధుంటే ఎప్పుడూ రైళ్ళలోగాని, బస్సుల్లోగాని ఎవ్వరితోనూ మాట్లాడకూడదని నాపై ఒట్టేసుకున్నాను.

ఆలోచించి.... ఆలోచించి ఒక ఘాటైన ఉత్తరం వ్రాయాలనుకొన్నాను. పది పేజీల ఉత్తరం తయారైంది. ఈ




ఉత్తరం చూసి.... ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకున్నా ఆశ్చర్యపడవలసింది లేదు. ఆశ్చర్యపడవలసిందల్లా ఎప్పుడంటే.... ఆమె ఆత్మహత్య చేసుకోలేదు అన్నప్పుడే. ఉత్తరాన్ని పోస్టులో పడేశాను.

....అదే రోజున నా పేర ఒక పార్సిలు వచ్చింది.... విప్పాను.... ఫైలు....! నా ఫైలు....!! అబ్బ దొరికింది. గబగబా తిప్పాను. చెక్కు చెదరలేదు. పైన ఒక ఎర్రటి కవరు వుంది. ఏముంది! క్షమాపణలు చెబుతూ వుత్తరం రాసుంటుంది. అసలు నా ఫైలుతో తనకేం పని? ఉత్తరం చదవాలనిపించలేదు. చించి పారేయాలనుకొన్నాను.

ఒక్క క్షణం.... ఆలోచించాను. అందులో ఫైలు తీసుకోవాల్సిన అవసరం ఏమిటో రాసుంటుంది. అదైనా తెలుసుకొందామనుకుంటూ ఉత్తరంవిప్పాను.

“సుధాకర్‌గారికి,

క్షమాపణలతో.... మీ ఫైలు పంపుతున్నాను. ఆశ్చర్యపోతున్నారు కదూ! మీ ఫైలు దొరుకుతుందన్న ఆశ బహుశా మీరు వదిలేసి ఉండొచ్చు.

'ఆఁ.... పంపకేం చేస్తావు. రమేష్ వచ్చి నాలుగు తగిలించి వుంటాడు. అయినా ఫైలు పైన ఆశ వదలడం ఏమిటి, ఇచ్చే వరకు ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించి వుండేవాణ్ణి.'

“...చిన్నవారైనా నన్ను క్షమించాలి. నా అవసరం కొద్దీ మీ ఫైలు తీసుకోవలసి వచ్చింది.”

'ఏమిటి నాకంటె పెద్దదా? అలా కనపడదే! ఏమో ఆడవాళ్ళ అందాన్ని

అంచనా వేసినట్లు వయసును వేయలేం. ఇంతకీ నా ఫైలుతో ఏమి అవసర మొచ్చిందో చూద్దాం !'

"మీరు వెళ్తున్న అదే ఇంటర్వ్యూకు మా అబ్బాయి కూడా హాజరవుతున్నాడు. వాడు అన్ని క్లాసుల్లోను ఫస్ట్ రేంకులో ప్యాసైనా మీ కంటే కొంత తక్కువ చదువుతున్నాడు. ఇప్పటి పరిస్థితులలో వాడికి వుద్యోగం ఎంతో అవసరం. మీరు ఇంటర్వ్యూకు రాకపోతే వాడు తప్పక సెలెక్ట్ అవుతాడని నాకు నమ్మకం కలిగింది."

'ఏమిటీ పెళ్ళి కూడా అయిందా ? ఒక అబ్బాయి కూడా వున్నాడా ?!'

"మీతో కలిసి ఆ రైలులో ప్రయాణం చేశాను. మీరు చెబుతున్నదంతా విన్నాను"

'పిచ్చాసుపత్రి నుంచి పారిపోయి రాలేదు కదా !'

"మీ ప్రక్క సీట్లో వున్న నేను మీరు నిద్ర పోయింతర్వాత మీ ఫైలు తీసు కొన్నాను.... కాదు దొంగిలించాను. మీరు ఇంటర్వ్యూకు వెళ్ళలేకపోయి నందుకు చాలా బాధపడివుంటారు. దీనికి పరిహారంగా నేను మీకు ఏం చేసినా తక్కువే. నా స్వార్థంతో మీకు అన్యాయం చేశాను. మీ ఫైలులో మీరు పెట్టిన డబ్బుతో మరికొంత డబ్బు చేర్చి అక్కడే వుంచాను. అవి మీరు హైదర బాదు ఖర్చుల క్రింద ఉంచుకోండి. మా వాడికి ఉద్యోగం వచ్చింది. మరొక్క సారి క్షమించమని అడుగుతూ....

గుణశేఖరరావు."

ఆఁ........ ఒక్క క్షణం అలా నిశ్చేష్టుడైపోయాను.... విషయం అర్థ మైంది. మరి గీతకు రాసిన ఉత్తరం.... పరిగెత్తుకుంటూ పోస్టాఫీసుకు వెళ్లాను.

ఉత్తరం మెయిల్లో వెళ్ళిపోయింది. ఇప్పుడెల్లా !? గీత ఉత్తరం చదువు తుంటే ?.... అమ్మో.... ఇక ఊహించ లేకపోయాను. గీత కళ్లల్లో మెదిలింది. గబగబా ఇంటకెళ్ళి బ్యాగు సర్దుకొన్నాను.

మూడు గంటల వెంకటాద్రి ఎక్స్ ప్రెస్ అందుకోవాలి. రిజర్వేషన్ లేదు. జనరల్ కంపార్టుమెంటే గతి....

హైదరాబాదు చేరేవరకు నోరెత్తితే ఒట్టు....

